నమస్తే తెలంగాణ





ప్రజానేత పీ జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్‌లో పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు

# పీజేఆర్‌కు కేటీఆర్ నివాళి

ఖైరతాబాద్/కవాడిగూడ, డిసెంబర్ 28 : దివంగత ప్రజానేత పీ జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) వర్ధంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పీజేఆర్ సేవలను గుర్తు చేశారు. అంతకు ముందు దోమలగూడలోని పీజేఆర్ తనయుడు మాజీ ఎమ్మెల్యే పీ విష్ణువర్ధన్‌రెడ్డి నివాసానికి కేటీఆర్ వెళ్లి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేటీఆర్ వెంట మాజీ హోం మంత్రి మహమూద్‌అలీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, దానం నగేందర్, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్, నాయకులు గజ్జెల నాగేశ్, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ రె'ఢీ'

- 3 నుంచి నియోజకవర్గాలవారీగా సమీక్షలు
- ప్రజలతో మమేకమవుతున్న శ్రేణులు
- విస్తృతంగా తిరుగుతున్న నాయకులు





హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ పార్టీకి, ప్రత్యర్థి పార్టీలకు వచ్చిన ఓట్లను బేరీజు వేసుకొని అవసరమైన కార్యాచరణ రూపొందించుకుంటున్నది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ పరిస్థితిని అంచనావేసి ముందుకు సాగుతున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 25న చేవెళ్ల ఎంపీ జీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితర ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి అసెంబ్ల సెగ్మెంట్లవారీగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసి, అందుకు అనుగుణమైన కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. ఇదే సమావేశంలో ఈ సారి చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో దిగుతారని కేటీఆర్ సూచనప్రాయంగా చెప్పారు. దీంతో ఇప్పటికే కార్యక్షేత్రంలోకి దిగిన రంజిత్‌రెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా ఉంటారని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సభలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాలుగైదు రోజుల నుంచే బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశం అవుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలు, మాజీలు సైతం నియోజకవర్గాల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకం అవుతున్నారు. మండలాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

### 'గెలుపు దారులు వేసుకుందాం'

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలైనంత మాత్రాన నిరాశచెందాల్సిన పనిలేదని, ఓటమిని పాఠంగా స్వీకరించి గెలుపు కోసం దారులు వేసుకుందామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల ముఖ్యనేతల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పదేండ్లపాటు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని, అదృష్టాన్ని ఇస్తే అద్భుతాలు సృష్టించామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, వాటికి అనుబంధంగా ఇచ్చిన హామీలను అమలు చేయించే గురుతర బాధ్యత బీఆర్ఎస్‌పై ఉన్నదని చెప్పారు. ఒకవేళ అధికార పక్షం చేతులెత్తేస్తే ప్రజల పక్షాన నిలబడి కొట్లాడాల్సిన బాధ్యత కూడా బీఆర్ఎస్‌పైనే ఉందని పార్టీ భావిస్తున్నది.

## లోకం పోకడ




## 11 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సాగు ప్రారంభమైంది. బుధవారం వరకు 11.08 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం 1.3 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గినట్టు పేర్కొన్నది. నిరుడు ఇదే సమయానికి 12.39 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది అత్యధికంగా వరి 2.93 లక్షల ఎకరాల్లో సాగు కాగా, మొక్కజొన్న 2.50 లక్షల ఎకరాలు, పెసర 2.38 లక్షల ఎకరాలు, వేరుశనగ 1.8 లక్షల ఎకరాల్లో సాగైనట్టు పేర్కొన్నది.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 10.8°c | 32.1°c |
| రంగారెడ్డి | 11.1°c | 33.4°c |
| మెదక్ | 12.4°c | 33.9°c |
| నల్లగొండ | 15.4°c | 32.0°c |
| ఖమ్మం | 16.0°c | 30.0°c |
| కరీంనగర్ | 16.0°c | 29.0°c |
| హైదరాబాద్ | 16.9°c | 28.3°c |
| నిజామాబాద్ | 17.0°c | 31.4 °c |
| వరంగల్ | 17.0°c | 30.0°c |
| మహబూబ్‌నగర్ | 18.1°c | 31.0° |

# ఉచిత విద్యుత్తుపై స్పష్టత ఇవ్వాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణ సేవా సంఘం విజ్ఞప్తి**

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ధోబీఘాట్లు, ల్యాండ్రీలు, హెయిర్ కటింగ్ సెలూన్లకు అందిస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్తుపై నూతన ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ గురువారం కోరారు. గత ప్రభుత్వం నాయీబ్రాహ్మణులు, రజకులకు అండగా నిలిచేందుకు ఉచిత విద్యుత్తును అందిస్తూ వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో గత మూడు నెలలుగా బిల్లులు నిలిచిపోయాయని తెలిపారు. పెరుగుతున్న బిల్లులను చూసి వృత్తిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు.

## రైతుబంధు ఇస్తే నాట్లేసేటోణ్ని!

మొదటిపేజీ తరువాయి...

పొలం చూడాలని కోరాడు. నర్సయ్య కోరిక మేరకు పొలం వద్దకు వెళ్లిన వినోద్‌కుమార్.. 'వ్యవసాయం ఎలా సాగుతున్నది' అని అడిగారు. 'వడ్ల పైసలతో పొలం దున్ని, విత్తనాలు తెచ్చి నారుపోసిన. ఇప్పుడు వరి నాటుకు వచ్చింది. నాటు వేద్దామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. నారు ముదురుతున్నది' అని ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు బంధు పైసలు వస్తాయని ఆశగా చూస్తున్నానని, రెండు రోజులకోసారి బ్యాంకుకు వెళ్లి ఖాతాలో డబ్బులు పడ్డయో లేదో చూసి వస్తున్నానని, ఇంతవరకు రైతు బంధు పైసలు పడలేదని వాపోయాడు. అందుకే నాటువేసేందుకు వెనుకడుగు వేస్తున్నానని చెప్పిన రైతు.. కేసీఆర్ సారు ఉన్నన్ని రోజులు రెండు పంటల పెట్టుబడికి రంది లేకుండెనని, నాటు వేసే సమయానికి రైతుబంధు పైసలు పడేటియని, కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతుల బతుకులు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని వివరించాడు. వినోద్ వెంట కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, నాయకులు సంపత్ ఉన్నారు.

## చిరుధాన్యాలే ప్రత్యామ్నాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): మారుతున్న పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా వరికి చిరుధాన్యాల పంటలే ప్రత్యామ్నాయమని ఇక్రిసాట్ తేల్చింది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆహార అవసరాలను తీర్చగలిగే ప్రత్యామ్నాయ పంట ఉత్పత్తులూ చిరుధాన్యాలేనని ఇక్రిసాట్ పరిశోధకులు వెల్లడించారు. పర్యావరణ మార్పుల కారణంగా వరి ధాన్యం దిగుమతిపై ప్రభావం పడుతున్నది. దీంతో ఆహారపు ఉత్పత్తి కొరత ఏర్పడుతుండగా, ఆహార భద్రతకూ ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నది. పెరుగుతున్న నిర్వహణభారం కారణంగా ప్రస్తుతం వరి సాగుబడి తగ్గుతూనే ఉన్నది. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు కూడా పంట దిగుబడి తగ్గుదలకు మరో ప్రధాన కారణం. చిరుధాన్యాల పంటలపై చీడపీడల ప్రభావం ఏమాత్రం లేకుండా దిగుబడిని పొందవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీంతోపాటు ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యం ఎక్కువగా ఉండటం, తక్కువ నిర్వహణ ఖర్చులు, పంటకాలం, నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితుల్లోనూ ఏమాత్రం దిగుబడి తగ్గకుండా ఉండే లక్షణాలు చిరుధాన్యాలకు ఉండటమే వరికి ప్రత్యామ్నాయ పంటగా భావించడానికి కారణమని వారు చెప్తున్నారు.

# ఢిల్లీ ఆస్తి పంపకాలెప్పుడు?

- ఏపీ ముందు తెలంగాణ 3 ప్రతిపాదనలు
- ఏపీ ఆమోదిస్తే వెంటనే భవన్ నిర్మాణం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన జరిగిన దాదాపు పదేండ్లు పూర్తి కావస్తున్నప్పటికీ ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తి విభజన మాత్రం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఢిల్లీ ఆస్తి పంపకాలపై గురువారం తెలంగాణ, ఏపీ అధికారులు సమావేశమయ్యారు. తమ వాటా కింద వచ్చే భవనాలు కాకుండా కొత్తగా తెలంగాణ భవన్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ అధికారులు మూడు ప్రతిపాదనలు చేసినట్టు తెలుస్తున్నది. దీనిపై ఏపీ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని తెలియజేస్తే ఆస్తి పంపకం పూర్తవుతుంది. ఆ తరువాత నూతన తెలంగాణ భవన్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది.

ప్రస్తుతం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ భవన్‌లుగా చెప్పుకుంటున్న ఉమ్మడి ఆస్తి 19 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. ఇందులో శబరి బ్లాక్‌తోపాటు ఎనిమిది ఎకరాల్లో ఉమ్మడి భవనాలు, ఇంటర్నల్ రోడ్లు, గోదావరి బ్లాక్ ఉన్నాయి. మూడు ఎకరాల్లో పాత నర్సింగ్ హాస్టల్, ఏడు ఎకరాల్లో పటౌడీ హౌస్ ఉన్నాయి. పునర్విభజన చట్టం ప్రకారం ఈ 19ఎకరాల్లో తెలంగాణకు ఎనిమిది, ఏపీకి 11ఎకరాలు చెందుతాయి. భవనాల్లో 41.68 శాతం తెలంగాణకు, 58.32శాతం ఏపీకి చెందుతాయి. ప్రస్తుతం ఇదే నిష్పత్తిలో భవనాలను రెండు రాష్ట్రాలు వాడుకుంటున్నాయి. కాగా తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో కొత్తగా తెలంగాణ భవన్‌ను నిర్మించాలని సంకల్పించింది. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా అధికారులు తమ వాటా కింద ఉన్న స్థలాన్ని పరిశీలించి నూతన భవనం ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందనే అంశంపై చర్చించారు. ప్రస్తుతమున్న నిర్మాణాలు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో అవి ఏ మేరకు పటిష్ఠంగా ఉన్నాయో పరిశీలించిన అనంతరం తెలంగాణకు నూతన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. తెలంగాణ భవన్ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టంచేశారు. ముందుగా తమ వాటా ఏవైపు వస్తుందో తేలితే కొత్త భవనం ఎక్కడ నిర్మించాలన్నది నిర్ణయించవచ్చు. ప్రస్తుతమున్న నిర్మాణాలు, ఇంటర్నల్ రోడ్లలో తెలంగాణకు రావాల్సిన ఎనిమిది ఎకరాలు ఎటువైపు తీసుకోవాలి అనేదానిపై తెలంగాణ అధికారులు మూడు రకాల ప్రతిపాదనలను ఏపీ ముందుంచారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న భవనాలకు, వారి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రతిపాదనలు ఉంటే పొరుగు రాష్ట్రం నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉండకపోవచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు ప్రతిపాదనల్లో ఏదో ఒకదాన్ని ఏపీ ప్రభుత్వం ఆమోదిస్తే ఆ తదుపరి తెలంగాణ భవన్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించనున్నారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

## కాలయాపనకే దరఖాస్తుల స్వీకరణ

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి
- నిరుద్యోగ భృతిపై మాటమార్చిన డిప్యూటీ సీఎం భట్టి
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 28 : ప్రజా పాలన పేరిట రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుందని.. ఇదంతా పార్లమెంట్ ఎన్నికల వరకు కాలయాపన చేసేందుకేనని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను జాప్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాటతప్పిందని అన్నారు. పంట పెట్టుబడి కింద రూ.15 వేలు అందిస్తామని చెప్పినా, పాత పద్ధతిలో రూ.10 వేలకు కూడా దిక్కులేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట మార్చడం సరికాదని అన్నారు. ప్రియాంక గాంధీ సభలో చెప్పిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సర్కార్ ప్రజలకు కల్యాణలక్ష్మి , ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను ఎక్కడా ఆపలేదని గుర్తుచేశారు.

### వరినాట్లు పూర్తి చేయాలి..

నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతులు వెంటనే వరినాట్లు పూర్తి చేయాలని, ఇప్పుడు నాట్లు వేయడంతో మార్చి చివరి నాటికి పంటలు కోత దశకు వస్తాయని ఎమ్మెల్యే పోచారం తెలిపారు. నిజాంసాగర్ నీటి విడుదల విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. నిజాంసాగర్ నీటి విడుదల 30 ఏండ్ల నుంచి కొనసాగుతున్నదని, ఇందులో రాజకీయ ప్రమేయం ఉండదని సూచించారు. చివరి ఆయకట్టుకు నీరందేలా రూ.150 కోట్లతో నియోజకవర్గంలో కాలువలు బాగుచేయించినట్టు తెలిపారు.

# రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా?

- మొత్తంగా 7.5 ఎకరాలకే సాయం!
- ఆహార భద్రత కార్డుతో అనుసంధానం?
- ఇప్పుడు కార్డు ఉంటేనే దరఖాస్తు
- సీలింగ్ పెడతామని వ్యాఖ్యానించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- దరఖాస్తుల ఆవిష్కరణలోనూ సీఎం రేవంత్‌రెడ్డి సంకేతాలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా అందనున్నదా? పెట్టుబడి సాయానికి పరిమితి విధించే దిశగా కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తున్నదా? గరిష్ఠంగా 7.5 ఎకరాలకే పెట్టుబడి సాయం అందజేయనున్నదా? రేషన్ కార్డు లేకపోతే పెట్టుబడి సాయం రాదా? అంటే అవుననే అనుమానాలు కలుగుతున్నాయి. రైతుభరోసాకు రేషన్ కార్డును లింక్ చేసే దిశగా చర్యలు చేపట్టడమే అందుకు కారణం. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 'గ్యారెంటీ' దరఖాస్తులకు రేషన్ కార్డు ప్రతిని జత చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉన్నది. దాని ప్రకారమే దరఖాస్తులో రేషన్ కార్డు నంబర్, రైతుభరోసా కాలమ్ ఉన్నాయి. దీన్ని బట్టే పెట్టుబడిసాయానికి, రేషన్ కార్డుకు లింక్ చేస్తారన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. సాధారణంగా ప్రతిసారి సీజన్‌కు ముందుకు కొత్త రైతులు ఎవరైనా ఉంటే వారి నుంచి ఆయా ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించి వారి పేర్లను రైతుబంధు జాబితాలో చేర్చుతారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాకు కొత్త రైతుల ఎంపికను ప్రత్యేకంగా రేషన్‌కార్డుతో సంబంధం ఉన్నటువంటి గ్యారెంటీల దరఖాస్తులో చేర్చింది. ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుందో పరిశీలించాక ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని తెలిసింది.

### కార్డు లింక్ చేస్తే 7.5 ఎకరాలకే కటాఫ్!

ఆహార భద్రత నిబంధనల ప్రకారం తెల్ల రేషన్ కార్డు పొందాలంటే తడి భూమి 3.5 ఎకరాల వరకు, మెట్ట భూమి 7.5 ఎకరాల వరకు ఉండాలి. అంటే ప్రస్తుతం తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్నవారికి గరిష్ఠంగా 7.5 ఎకరాల వరకు భూమి ఉంటుంది. దీంతో రైతుభరోసాకు తెల్ల రేషన్‌కార్డును లింక్ చేస్తే 7.5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు మాత్రమే పెట్టుబడి సాయానికి అర్హులు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కూడా రేషన్‌కార్డు నిబంధనలకు కాస్త అటుఇటుగా భూ పరిమితి పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రైతుబంధులో సుమారు 70 లక్షల మంది రైతులు ఉండగా, 1.52 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. ఇందులో 8 నుంచి 54 ఎకరాల వరకు సుమారు 3 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరి వద్ద 26 లక్షల ఎకరాల భూమి ఉన్నది. వీరికి సుమారు రూ.13 కోట్ల వరకు రైతుబంధు అందుతున్నది. అయితే 8 ఎకరాల్లోపు రైతుల్లోనూ రేషన్‌కార్డు లేని రైతులు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు వారు రేషన్‌కార్డు లేకపోతే రైతుభరోసా ఇవ్వరా? అని ఆందోళన చెందుతున్నారు.



### ఇప్పటికే సీఎం, మంత్రుల సంకేతాలు

తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ రైతుభరోసాలో భూ పరిమితికి మద్దతుగానే తన వైఖరిని వెల్లడించింది. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆ పార్టీ మంత్రి సీతక్క, సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రైతుభరోసా పరిమితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. పెద్ద పెద్ద భూస్వాములకు, పాడుపడ్డ భూములకు రైతు బంధు ఇస్తున్నారని, దీన్ని కచ్చితంగా సవరిస్తామని స్పష్టం చేశారు. గ్యారెంటీల దరఖాస్తు ఆవిష్కరణ సందర్భంగానూ రైతుభరోసా పరిమితిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించటంతో దీనిపై జోరుగా చర్చ జరుగుతున్నది. అయితే ఈ యాసంగి సీజన్‌కు నిబంధనల్లో మార్పులు చేర్పులకు సమయం లేకపోవటంతో ఈసారికి పాత పద్ధతిలోనే రైతుబంధు పంపిణీ చేస్తున్నది. వానకాలం సీజన్ నాటికి భారీ మార్పులు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా ఎకరానికి రూ.10 వేలు ఇవ్వగా కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇది అమలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఏటా అదనంగా రూ.7,500 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. అంటే ప్రస్తుతం ఏటా రూ.15 వేల కోట్లు అవసరం అవుతుండగా, ఇక నుంచి రూ.22,500 కోట్లు అవసరం కానున్నాయి. అయితే ఇంత ఆర్థిక భారం మోయడం ప్రభుత్వానికి ఇబ్బందికరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతుభరోసాకు పరిమితులు విధించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది.

# బీఆర్‌ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతల దాడి

- తీవ్ర గాయాలు.. దవాఖానలో చికిత్స
- బాధితుడికి జగదీశ్‌రెడ్డి పరామర్శ
- కాంగ్రెస్ దాడి దుర్మార్గమని ధ్వజం

అర్వపల్లి/సూర్యాపేట, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కాసర్లపహాడ్‌లో బీఆర్ఎస్ నాయకుడు, యువ రైతుపై కాంగ్రెస్ నాయకులు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. కాసర్లపహాడ్‌కు చెందిన మెండె సురేశ్ గ్రామ శివారులోని సొంత భూమిలో డ్రాగన్ ఫ్రూట్స్ పండిస్తూ తోట వద్ద ఇల్లు కట్టుకొని ఉంటున్నాడు. సురేశ్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, పార్టీ బహిరంగ సభల్లో విచిత్ర వేషధారణలతో ప్రభుత్వ పథకాలను తన ఒంటిపై రాసుకొని కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకునేవాడు. కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేస్తున్నాడనే కారణంతో.. పది మంది హస్తం పార్టీ నాయకులు గురువారం మధ్యాహ్నం తన భార్యతో కలిసి తోట పనులు చేసుకుంటున్న సురేశ్‌పై కర్రలతో దాడి చేశారు. అడ్డుకోబోయిన భార్యపైనా దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడ్డ సురేశ్‌ను స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి సూర్యాపేట జనరల్ దావఖానకు వెళ్లి సురేశ్ దంపతులను పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాకముందే బీఆర్ఎస్ నేతలపై ఆ పార్టీ గూండాలు దాడులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. ఘర్షణలు తెలంగాణ సమాజానికి మంచిది కాదని, అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తమ పదేండ్ల పాలనలో రాజకీయ ఘర్షణలకు తావు లేకుండా చేశామని, చిన్నాచితక జరిగినా పార్టీలకతీతంగా వ్యవహరించి ఆదిలోనే అణిచివేశామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ దాడులను ఆపాల్సిన బాధ్యత జిల్లా మంత్రులది, పోలీసు అధికారులదేనని, ఘర్షణలు అదుపు చేయడంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.



కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడి సూర్యాపేట దవాఖానలో చికిత్స పొందుతున్న సురేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

### సురేశ్‌పై దాడి సిగ్గుచేటు: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నాయకుడు మెండే సురేశ్‌పై జరిగిన దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సురేశ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, గ్యాదరి కిశోర్ దవాఖానలో సురేశ్‌ను పరామర్శించారని, త్వరలో తాను తుంగతుర్తికి వెళ్లి కలుస్తానని కేటీఆర్ తెలిపారు.

## ఆరు గ్యారెంటీలను తప్పించుకునేందుకు కుట్ర

- అందుకే ఆర్థిక పరిస్థితిపై వ్యాఖ్యలు
- కాంగ్రెస్ సర్కారుపై జగదీశ్‌రెడ్డి ఫైర్

సూర్యాపేట, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలు నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నదని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ గ్యారెంటీల అమలు నుంచి పక్కకు జరగాలని యోచిస్తున్నదని ఆరోపించారు. గురువారం ఆయన సూర్యాపేటలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కలిసి మీడియాతో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలు ఉన్నాయనుకున్నామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అనడాన్ని ఆయన తప్పుబట్టారు. కొద్ది సంవత్సరాలుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో, బయట కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఇచ్చిన గ్యారెంటీల నుంచి తప్పించుకునేందుకే ఇవన్నీ చేస్తున్నారేమోనని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతా ఓపెన్ అని, ఎలాంటి రహస్యాలు ఉండవని పేర్కొన్నారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### బీఐఎస్‌లో..

**బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 5
- **పోస్టులు:** గ్రాడ్యుయేట్ ఇంజినీర్
- **అర్హతలు:** సంబంధిత బ్రాంచీలో మాస్టర్స్ లేదా బీఈ/ బీటెక్‌లో ఈఈఈ లేదా ఎఫ్‌సీటీ, ఎంసీఎం ఉత్తీర్ణత
- దరఖాస్తు, చివరితేదీ తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- **వెబ్‌సైట్:** www.bis.gov.in

### ఆర్కే పురం ఆర్మీ స్కూల్‌లో..

**సికింద్రాబాద్ ఆర్కే పురంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 62
- **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, ప్రీ ప్రైమరీ టీచర్స్, హెడ్ మిస్ట్రెస్
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** https://apsrkpuram.edu.in

### టెక్నికల్ పోస్టులు

**ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 16
- **పోస్టులు:** టెక్నికల్ స్టాఫ్
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 29
- **వెబ్‌సైట్:** www.fddiindia.com

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- జనరల్ సైన్స్, జాగ్రఫీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.